# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER-2012

సంవత్సర చందా రూ.50/-

క్రీస్తుసంఘములు సమర్పించు
సత్యవాణి టి.వి కార్యక్రమములు

ప్రతి ఆదివారం సాయంత్రం6:00గంటలకు
**శుభవార్త**

ప్రతి బుధవారం
సాయంత్రం 6:30గంటలకు
**రక్షణ ఛానల్**

ప్రతి గురువారం
మధ్యాహ్నం 2:30గంటలకు
**రక్షణ ఛానల్**

ప్రతి శనివారం ఉదయం 8:00గంటలకు
**ఆరాధనఛానల**లలో వీక్షించండి.

ఉచిత బైబిల్ కోర్సులో చేరండి.ఒక బైబిలును బహుమతిగా పొందడి.ఈరోజే మాకు వ్రాయండి.

**సత్యవాణి**
పోస్టుబాక్సునం-80
కాకినాడ-533 001.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | నవంబరు - 2012 | సంచిక - 4

## లేఖనములను పరిశోధించుడి
## (Search the Scriptures)

బైబిలు పఠనము మన ప్రతి ఒక్కరి జీవితములోను అతి ప్రాముఖ్యమైనది. బైబిలు గ్రంథమును చదువుట ద్వారా మన ఆధ్యాత్మికతృష్ణ తీర్చబడును. మానవుని సమస్తసమస్యలకు బైబిలు జవాబు చెప్పు చున్నది. అందుకే దావీదు మహారాజు ఇట్లు పలికెను: "దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక యెహోవా ధర్మ శాస్త్రమునందు ఆనందించుచు దివా రాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాట బడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలెనుండును. అతడు చేయున దంతయు సఫలమగును"( క్రీర్తన 1:1-3). మనము చదువు నిమిత్తము ధ్యానించు నిమిత్తము పరిశుద్ధ లేఖనములు వ్రాయబడెను. మానవుల యెడల దేవుని చిత్తమును మనకు బయలుపరచు నిమిత్తము అవి వ్రాయబడెను. అందు వలననే, "లేఖనములు యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి; అవే నన్ను గూర్చి

సాక్ష్యమిచ్చుచున్నవి" యని యోహాను 5:39లో యేసుపలికెను. గనుక మిత్రులారా, పరిశుద్ధ లేఖనములను మనము పరిశోధించుట ప్రాముఖ్యము.

ఒకసారి పౌలును, సీలయు బెరయ అను పట్టణమునకు సువార్త బోధించు నిమిత్తము పంపబడిరి. వారు వచ్చి యూదుల సమాజ మందిరములో ప్రవేశించిరి. అయితే బెరయలోనున్నవారు థెస్సలోనీకలో ఉన్న వారికంటె ఘనులై యుండిరి గనుక వారు ఆసక్తితో వాక్యమును అంగీకరించి. పౌలును, సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములను పరిశోధించుచు వచ్చిరి అని వ్రాయబడియున్నది (అపొ.కా. 17:10,11). బెరయలోని వారివలె ఈనాడును మనము వినుచున్న బోధ లేఖనముల ప్రకారము ఉన్నదో లేదో పరిశోధించు బాధ్యతను దేవుడు మనకు అప్పగించి యున్నాడు. మరియు ముఖ్యముగ యేసుక్రీస్తును గూర్చియు, ఆయన యిచ్చు రక్షణను గూర్చియు, ఆయన సంఘమును గూర్చియు సత్యమును తెలిసికొనవలెనన్న మనము లేఖనములను పరిశోధించవలెను.

**లేఖనములను మనము భయ భక్తులతో పరిశోధింపవలెను:**

ఏలయనగా "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యధార్థమైనది, అది ప్రాణమును తెప్పరిల్ల జేయును. యెహోవా శాసనము నమ్మదగినది, అది బుద్ధిహీనులకు జ్ఞానము పుట్టించును. యెహోవా ఉపదేశములు నిర్దోషమైనవి, అవి హృదయమును సంతోషపరచును. యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది, అది కన్నులకు వెలుగిచ్చును. యెహోవాయందైన భయము పవిత్రమైనది, అది నిత్యము నిలుచును. యెహోవా న్యాయవిధులు సత్యమైనవి అవి కేవలము న్యాయమైనవి. అవి బంగారుకంటెను విస్తారమైన మేలిమి బంగారుకంటెను కోరదగినవి. తేనెకంటెను జుంటి తేనె ధారల కంటెను మధురమైనవి" యని దావీదు మహారాజు కీర్తన 19:7-10లో వ్రాసెను. మనకు జ్ఞానము కలుగు నిమిత్తము, మన కన్నులకు వెలుగు కలుగునిమిత్తము లేఖనములను మనము భయభక్తులతో పఠించవలెను.

**లేఖనములను మనము అతి జాగరూకతతో పరిశోధింపవలెను:**

జ్ఞానియైన సొలోమోను రాజు ఇట్లు పలికెను :జ్ఞానమునకు నీ చెవి యొగ్గి హృదయ పూర్వకముగా వివేచన నభ్యసించిన యెడల, తెలివికై మొఱ్ఱపెట్టిన యెడల, వివేచనకై మనవి చేసినయెడల, వెండిని వెదకినట్లు దానిని వెదకినయెడల యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట యెట్టిదో నీవు గ్రహించెదవు.

దేవునిగూర్చిన విజ్ఞానము నీకు లభించును. యెహోవాయే జ్ఞాన మిచ్చువాడు. తెలివియు, వివేచనయు, ఆయన నోట నుండి వచ్చును" (సామెతలు 2:1-6).

**లేఖనములను మనము సరిగ విభజించి పరిశోధింపవలెను :**

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కర లేని పనివానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించువానిగాను (విభజించువాని గాను) నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్త పడుము" అని అపొ. పౌలు తిమోతిని హెచ్చరించెను (2 తిమోతి 2:15). బైబిలును చదువునప్పుడు అందున్న పాత క్రొత్తనిబంధనల సంబంధమును మనము ఎరుగ వలయును. బైబిలు గ్రంథము అంతయు దేవుని వాక్యమే అయినను, దానిలోని పాతనిబంధనను బట్టిగాక క్రొత్తనిబంధనను బట్టి మనము దేవుని యొద్దకు చేరుకొన గలము అని గమనించవలెను. యేసుక్రీస్తు పాత నిబంధనను సంపూర్తిగ నెరవేర్చెను. దానిని మేకులతో సిలువకు కొట్టి దాని మీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి, మన అపరాధములనన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మనలను జీవింపజేసెను అని కొలస్స 2:13-15లో వ్రాయబడి యున్నది. పాతనిబంధనను మనము పరిశోధించుట అత్యవసరమే. గాని ఒక చట్టమువలె అది అమలులో లేదు. ఏలయనగా దానిని ఎత్తివేసి క్రీస్తు క్రొత్త నిబంధనను మనకు అనుగ్రహించి యున్నారు. "ధర్మశాస్త్రము మోషేద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" అని యోహాను 1:17 లో వ్రాయబడి యున్నది గనుక సత్యవాక్యమయిన బైబిలు గ్రంథమును మనము సరిగ విభజించి అనుసరించవలెను.

**పరిశుద్ధ లేఖనములను మనము ప్రార్థన పూర్వకముగా పరిశోధించవలెను:**

బైబిలును చదువునప్పుడు లేఖనము ద్వారా దేవుడు మనతో మాటలాడుచున్నారు గనుక ఆయన చిత్తమును మనము గ్రహించుకొనునట్లును, ఆయన దివ్య జ్ఞానములోని లోతైన మర్మములను మనము తెలిసికొనగల్గునట్లును ప్రార్థన పూర్వకముగా లేఖనములను మనము పరిశోధింపవలయును. దావీదు వలె మనమును, "నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నాకన్నులు తెరువుము అని ప్రార్థించ వలయును (కీర్తన 119:18).

**లేఖనములను మనము విశ్వాసపూర్వకముగా చదువవలెను.**

దేవుని వాక్యమును మనము శంకించుచు చదువరాదు. బైబిలునందు

వ్రాయబడిన సంగతులన్నిటిని మనము అర్థము చేసి కొనలేము. ఏలయనగా అమితమైన దేవుని జ్ఞానము అందున్నది. మితమైన మానవ జ్ఞానమునకు ఆయనంత దేవుని జ్ఞానము అంతు చిక్కదు. అయితే మనకు గ్రాహ్యము కాని సంగతులను గూర్చి వాటిని శంకించుట కంటె, దేవుడే పలికెను గనుక వాటిని మనము విశ్వాసముతో అంగీకరించ వలెను. అందుకే "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటి ననుసరించి నడుచుకొనునట్లు బయలు పరచబడినవి యెల్లప్పుడు మనవియు, మనసంతతి వారవియునగునవి ద్వితీయో 29:29లో మోషే వ్రాసెను. మన రక్షణ నిమిత్తము ఏమైతే మనము చేయవలెనో వాటన్నిటిని దేవుడు తన గ్రంధమందు మనకు విశదముగ తెలియజేసెను. రక్షణనొందుటకు యేసు దేవుని కుమారు డని మనము విశ్వసించవలెను. మనము ఆయనయందు విశ్వసించు నిమిత్తము లేఖనములు వ్రాయబడెను. భక్తుడైన యోహాను ఇట్లు చెప్పుచున్నాడు : "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంధమందు వ్రాయ బడి యుండలేదుగాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్ము నట్లును, నమ్మి ఆయన నామ మందు జీవము పొందునట్లును ఇవి వ్రాయ బడెను" (యోహాను 20:30-31).

మనము దేవునియెదుట పాపము చేయకుండునట్లు లేఖనములను పరి శోధించవలెను:

"నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నాహృద యములో నీవాక్యము ఉంచుకొని యున్నాను" అని దావీదు మహారాజు వ్రాసెను (క్రీర్తన 119:11). దేవుని వాక్యము మనయొద్ద, మన హృదయములో యున్న యెడల శోధకుడు మన దగ్గరనుండి పారి పోవును. యేసుక్రీస్తు సాతానుని దేవుని వాక్య బలముచే ఎట్లు జయించెనో అట్లే మనమును జయించగలము. దేవుని వాక్యము పాపములో యున్న వానిని మారుమనస్సు నొందు నిమిత్తము ప్రేరేపించును. దేవుని అనుగ్రహము మారు మనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగువా? యని రోమా 2:3 లో వ్రాయబడి యున్నది. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను, అందరు ను మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు దేవుడు ఆజ్ఞాపించు చున్నాడు" అని అపొ.కా. 17:30 లో వ్రాయబడి యున్నది. "మీరు మారు మనస్సు పొందని యెడల మీరందరును ఆలాగేనశింతురు" అని లూకా 13:3లో యేసు పలికెను. గనుక

పాపమును జయించు నిమిత్తము మనము లేఖనము లను ప్రతిదినము పరిశోధించ వలెను.

మనము రక్షింపబడునిమిత్తము లేఖనములను పరిశోధించవలెను. “ఇప్పుడు దేవునికిని ఆయన కృపావాక్యము నకును మిమ్మును అప్పగించుచున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయు టకును పరిశుద్ధపరచబడిన వారంద రిలో స్వాస్థ్యమనుగ్రహించుటకును శక్తిమంతుడు” (అపో.కా. 20:32). లేఖనములలో నిత్య జీవమున్నది. గనుక దివారాత్రులు వాటిని పరిశోధించుడి. దేవుని ఆజ్ఞల నెరిగి వాటికి లోబడుడి. విధేయులైన వారికి మాత్రమే యేసు క్రీస్తు రక్షకుడని మరచిపోకుడి (హెబ్రీ 5:19)!

## దేవుడెంతో గంభీరముగా మాట్లాడుచున్నారు
## (God speaks so very Loudly)

పరమందొక దేవుడున్నారు ! మనకెట్లు తెలియును? ఆయన ఎంతో గంభీరముగా మాట్లాడుచున్నారు గనుక తెలియును! దేవుడు మౌనియై యున్నారని చెప్పి తదుపరి ఆయన గంభీరముగా మాట్లాడు చున్నారంటే నీకు ఆశ్చర్యంగానే యుండ వచ్చును. కొన్ని విధములుగా ఆయన గంభీరముగా మాట్లాడుచున్నారు. ఆయన ఎట్లు మాట్లాడుచున్నారు? లిఖిత పూర్వ కమైన బైబిలు గ్రంధము ద్వారా ఆయన చాలవిపులముగా మాట్లాడుచున్నారు. గాని ఆయన ప్రకృతి గ్రంధము ద్వారా కూడ మాట్లాడుచున్నారు. నీవు ప్రకృతి గ్రంధము ను వినుటద్వారా కూడ మాట్లాడుచున్నారు. నీవు ప్రకృతి గ్రంధమును వినుట ద్వారా బైబిలు గ్రంధమును కూడ బహుశ చదువు టకుపకరించ గలవు.

ప్రకృతి ద్వార మాటలాడుచున్నానని దేవుడే ప్రకటించారు :

దేవునిప్రవక్తయైన దావీదు ఇట్లు చెప్పాడు: “ ఆకాశములు దేవుని మహి మను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధచేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికొలనూలు భూమి యందంతట వ్యాపించి యున్నది. లోకదిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్లుచున్నవి” (కీర్తన 19:1-4). “దేవుని అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి” యని అపో.పౌలు చెప్పాడు (రోమా 1:20). “అయినను ఆయన ఆకాశము

నుండి మీకు వర్షమును, ఫలవంతము లైన రుతువులను దయచేయుచు ఆహారమునను గ్రహించుచు ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు మేలు చేయుట చేత తన్నుగూర్చి సాక్ష్యము లేకుండ చేయ లేదు" (అపో.కా. 14:17).

**ప్రకృతి యొక్క మూడు పేజీలు:**

దేవుని ప్రకృతి గ్రంథం మనము పఠించులాగున అనుదినం తెరువబడే యుంటాది. దానికి మూడు పేజీలున్నవి, అవి: ఆకాశములు, భూమి, సముద్రములు అవి పలువిధాలుగా తెరువ బడియున్నవి: సూర్యోదయం, సూర్యాస్తమయం, వర్షాకాలము, శీతాకాలము, వేసవికాలము, హిమము, మంచు, వర్షము, ఫలములు, పుష్పములు, గాలి, నీరు వరదలు, కొండలు లోయలు మొదలగునవి.

దేవుని మహిమను వివరించు ఆకాశములను గూర్చి దావీదు చెప్పాడు. పగటివేళ ఆకాశములు ఆశ్చర్యములు, రాత్రివేళ సంభ్రమాశ్చర్యములు! పగటిని సూర్యుడు ఏలును, రాత్రిని చంద్రుడు నక్షత్రములు ఏలును.

**సజీవుడైన దేవుని గూర్చి సూర్యుడు ప్రకటించును :**

దేవుడు సజీవుడై యున్నాడని సూర్యుడు ఆశ్చర్యరీతిగా ప్రకటించును. అది తపోజ్వల వాయువుల సముదాయము, అత్యంతగంభీర అణుధార్మిక అగ్ని గుండము. కోటానుకోట్ల డిగ్రీల ఉష్ణోగ్రత కలిగి హైడ్రొజన్‌వాయువు హీలియంగా దానిపై మార్చబడును. ప్రతిసెకనుకు 40 లక్షల టన్నుల సౌరపదార్థము శక్తివలె మార్చ బడును. దీనిలో భూమి చాల స్వల్ప భాగము మాత్రమే శక్తివలెను, వెలుగు వలెను పొందును. మనం పొందే సూర్య రశ్మికి, శక్తికి కిలోవాట్టుకు సెకనుకు ఒక పైసా చొప్పున చెల్లిస్తే, భూమి మీద నున్న బంగారమంతయు ఆ ఒక్క సెకనుకే సరిపోదు! దాని వెలుతురు, వేడి భూమిపై జీవనం కొరకు అత్యవసరము. జీవన దాత యొక్క శక్తి దీనిలో గంభీరముగా ప్రకటించబడుచున్నది. ప్రతి సూర్యోదయంలోను, సూర్యస్తమయంలోను దేవుని యొక్క మహిమ మనకు గొప్పగా ప్రదర్శింపబడుచున్నది. అనుదినం సూర్యాస్తమయాన్ని సూక్ష్మంగా పరీక్షించు, నీవు మోకాళ్లూని పరమందొక దేవుడున్నాడని చెప్పక యుండలేవు.

**సూర్యాస్తమయముల భాష :**

సూర్యస్తమయములు యేమి చెప్పుచున్నవి? అవి అంతము లేని దేవుని మూలాధారమును గూర్చి ప్రకటించు చున్నవి. ప్రతి సూర్యాస్తమయంలోని ప్రతిక్షణం విభిన్నమైనది. దీనిని దేవుడు వేలాదిసంవత్సరముల నుండి చేయుచునే యున్నాడు. అయినను దానికి డూప్లికేట్ ఎక్కడా లేదు: సూర్యాస్తయమం ఒక

అద్భుత కథలాంటిది. అదెట్లారంభమగునో, మార్పు జెందునో, ఎట్లు అంతమగునో ఎవనికి తెలియదు. సూర్యాస్తమయం మన మనస్సుకు సేదదీర్చును, భావాలకు ప్రేరణకలిగించును, మన జీవితాములను రంజింపజేయును.

**చంద్రుని వరమానము :**

భూమి యొక్క సైజులో చంద్రుడు సగం వుంటాడు. అయినను దాని శక్తి వలన భూమిపై సముద్ర అలలు ప్రభావితం చేయబడ్డాయి, సముద్ర తీరములు పరిశుభ్రముచేయబడ్డాయి. చంద్రనక్షత్రములను చూచి నిష్ప్రేరణగా ఎవడుండగలడు? దేవుడు తన సింహాసనముపై యున్నాడని, భూమి పైనున్న తన సృష్టినంతటిని ప్రేమించుచున్నాడని, వారిని గూర్చి చింతించుచున్నాడని ఒక గురుతుగా ఆకాశములో ప్రతి దినం ఒక గుర్తును వ్రేలాడజేయుచున్నాడు. ఈ మహిమనంతటినీ పరిశీలించిన తరువాత ఎవడును దేవుడు లేడని చెప్పజాలడు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, ఇంద్రధనస్సులు దేవుడు సజీవుడై యున్నారని ప్రకటించుచున్నవి. ప్రకృతి దేవుని గొప్ప గ్రంధము దానిని ప్రతి దినము జనులందరు చదువుచున్నారు.

**ప్రకృతిలో దేవుడు పరిపూర్ణముగా బయలు పరబడలేదు :**

ఒకడు ప్రకృతి యొక్క లక్షణములన్నియు పూర్ణముగా పఠించియుండవచ్చును; అయినను అతడు దేవుని పూర్తిగా ఎరిగి యుండకపోవచ్చును. ఏలయనగా ప్రకృతి అసంపూర్ణమైన, పరిపూర్ణము కాని దేవుని ప్రత్యక్షత అయ్యున్నది. దేవుడు లిఖించి యిచ్చిన బైబిలును చదువువరకు మనం దేవుని పూర్తిగా తెలిసికోలేము.

**బైబిలు మానవునికి దేవుని బయల్పాటు:**

దేవుని గూర్చి మానవుని అన్వేషణ యొక్క వివరణయే బైబిలు అని కొందరు చెబుతారు. గాని అది సత్యము కాదు. బైబిలు మానవునికి దేవుడిచ్చిన బయల్పాటు. అది దేవ దూతలచే వ్రాయబడిన గ్రంధముకాదు. దేవుని వ్రేలితో వ్రాయబడి మావునికీయబడిన సూత్రముల సంపుటి అదికాదు. బైబిలులోని మాటలు, తలంపులు దేవునిచే అనుగ్రహింపబడెను. గాని అది మానవులచే ఆదినుండి అంతము వరకు వ్రాయబడెను. దాని వ్రాయుచున్న మనుష్యుల కలమును దేవుడే నడిపించెను అది మంచి వారిచే మంచివారికే వ్రాయబడినది కాదు. అది బలహీనులును పాపులునైన స్త్రీపురుషల కొరకు బలహీనులైన మనుష్యులచే వ్రాయబడెను. నేటి మానవులకంటే వారేమీ అతీతమైనవారు కారనితామే చెప్పుకొన్నారు. గాని దేవుడు వారి తలంపులను అధీనములో యుంచుకొని వారి కలములనుపయోగించి తన వర్తమానమును మనకందించెను. దేవుని

గూర్చిన సత్యములన్నియు ఒకేసారి బయల్పరచబడలేదు గాని మానవుని మేధస్సును గ్రహణశక్తిని బట్టి క్రమక్రమముగా బయలుపరచబడెను.

**బైబిలు ఏమైయున్నదనగా :**

బైబిలుఏమైయున్నది? దానినదే చెప్పుకొననిద్దాం . అదొక దీపము, "నీవాక్యము నాపాదములకు దీపమును నాత్రోవకు వెలుగునైయున్నది" (కీర్తన 119:105). అదొక విత్తనము, "విత్తనము దేవుని వాక్యము" అని అది చెప్పుచున్నది (లూకా 8:11). దేవుని వాక్యము మన హృదయాల్లో ప్రేమ, మంచితనము, దయాళుత్వము, విశ్వాసము మొదలగు అనేక లక్షణాల బీజమును నాటును, ఆ విత్తనము మంచి నేలను పడితే అది మంచి ఫలములనిచ్చును. ఆ విత్తనము రాతి నేలను, ఎండిన నేలను, ముండ్లపొదల నేలను పడితే అది వాడిపోయి, చచ్చును. దేవుని వాక్యము సుత్తెవంటిది. "నామాట అగ్నివంటిది కాదా? బండను బద్దలు చేయుసుత్తెవంటిది కాదా, ఇదే యెహోవా వాక్కు" (యిర్మియా 23:29). మన దుష్టతలంపులను, చేష్టలను, పాపములను దేవుని వాక్యము సుత్తెవలె తుత్తునియలుగా చేయును. అది మాన చెడు కోరికలను, అవినీతిని అక్రమమును కాల్చివేసి నీతి న్యాయములు గల వారిగ శుద్ధిచేయును పరిశుద్ధపరచును.

**బైబిలు ఏమి చేయును ?**

దేవుని వాక్యము ఏమి చేయును? రక్షణార్థమైన జ్ఞానమును అది కలిగించును (2తిమోతి 3:15). లేఖనములు క్రీస్తును గూర్చి సాక్ష్యయిచ్చుచున్నవియని యోహాను 5:39 చెప్పుచున్నది. "మీరు సత్యమును గ్రహించెదరు, సత్యము మిమ్మును స్వతంత్రులునుగా చేయునని" బైబిలు చెప్పుచున్నది (యోహాను 8:32). దేవుని వాక్యము మనలను పరిశుద్ధపరచును, "నేను మీతో చెప్పినమాటను బట్టి మీరిప్పుడు పవిత్రులైయున్నారని" యేసు చెప్పెను (యోహాను 15:3). "సత్యమునందు వారిని ప్రతిష్ట చేయుము, నీవాక్యమే సత్యమని" ఆయన పలికెను (యోహాను 17:17). అది మన ఆత్మలను రక్షించును (యాకోబు 1:21). సత్యమునకు లోబడుట ద్వారా మన ఆత్మలు పవిత్రపరచబడునని 1పేతురు 1:22 చెప్పుచున్నది. అక్షయ బీజమగు దేవుని వాక్యము ద్వారా మనము తిరిగి జన్మించామని 1పేతురు 1:23 చెప్పుచున్నది.

**బైబిలు ఎన్నడు పాతగిలదు :**

బైబిలు మృతమైనది పాతగిలిపోయిందని కొందరు తలంచారు, గాని అది సత్యము కాదు. "నేను చెప్పుమాటలే ఆత్మయు జీవమునై యున్నవని క్రీస్తు చెప్పారు (యోహాను 6:63). "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలము గలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము

కంటెను వాడిగలదియై ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించు చున్నది" (హెబ్రీ 4:12). దేవుని వాక్యమే ఆత్మ యొక్క ఖడ్గమని ఎఫెసీ 6:17 చెప్పుచున్నది. యేసుప్రభువు చెప్పిన మాటలే అంత్యదినమందు అందరికీ తీర్పుతీర్చును (యోహాను 15:48).

**సర్వసత్యము బైబిలులో యున్నది :**

దేవుడు సర్వజ్ఞాని గనుక మానవుని యొక్క సమస్తావసరములను ఆదినుండి ఎరిగి యున్నవాడు గనుక ఆయన బైబిలు గ్రంథమును తన భక్తుల ద్వారా లిఖించి యిచ్చినప్పుడు ఆయన పాపఫలములన్నిటినీ ఎరిగినవాడై నీతి సూత్రములన్నిటిని మనకిచ్చియున్నారు. దేవుడు క్రీస్తును ఈలోకములోనికి పంపినప్పుడు, ఆయన తండ్రియైన దేవుని, ఆయనచిత్తాన్ని మనకు బయలు పరిచారు. మరియు "నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడని" చెప్పారు (యోహాను 14:9). సత్కార్యము లు చేయుడానికి దేవుని వాక్యము మనలను సన్నద్ధులుగా చేయునని పౌలు చెప్పాడు (2 తిమో 3:16-17).

**దేవుని ధర్మశాస్త్రము యదార్థమైనది :**

గనుక దేవుని గూర్చిన జ్ఞానము కొరకు మనము చీకటిలో తడుముకో నవసరం లేదు. మనం చేయవలసిన దంతా బైబిలును తెరచి చదువుకోడమే. అందులో దేవుడు మానవునికి పూర్తిగా బయలుపరచుకోవడం చూస్తాము. సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). దేవుని వాక్యము వినుట ద్వారా విశ్వాసము కలుగును (రోమా10:17). అందువలన దేవుని ప్రవక్తతో మనమును ఇట్లు చెప్పగలము.

"యెహోవా నియమించిన ధర్మ శాస్త్రము యదార్థమైనది అది ప్రాణమును తెప్పరిల్ల జేయును. యెహోవా శాసనము నమ్మదగినది అది బుద్ధి హీనులను జ్ఞానము పుట్టించును. యెహోవా ఉపదేశములు నిర్దోషమైనవి అవి హృదయమును సంతోషపరచును. యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది, అది కన్నులకు వెలుగిచ్చును. యెహోవాయందైన భయము పవిత్రమైనది అది నిత్యము నిలుచును, యెహోవా న్యాయవిధులు సత్యమైనవి అవికేవలము న్యాయమైనవి. అవి బంగారు కంటెను విస్తారమైన మేలిమి బంగారు కంటెను కోరదగినవి. తేనె కంటెను జుంటు తేనెధారలకంటెను కోరదగినవి. తేనె కంటెను మధురమైనవి. వాటివలన నీసేవకుడు హెచ్చరిక నొందును. వాటిని గైకొనుట వలన గొప్ప లాభము కలుగును" (కీర్తన 19:7-11).

# హన్నా ప్రార్థనా పరురాలు
## (Hannah, A Prayerful woman)

ఎల్కానాకు ఇద్దరు భార్యలుండిరి. అతడు హన్నాను ప్రియముగా ఎంచెను (1సమూ 1:5). ఆమె అతని మొదటి భార్యయని కొందరు చెప్పుదురు. క్రీస్తు యూదులలోనుండి ఉద్భవించును గనుక యూదులకు సంతాన ప్రాప్తిచాల ప్రాముఖ్యము. వివాహితుడైన యూదుడు సంతానము కలుగ జేయవలెనని మోషే ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించాడు. అట్లు కలిగిన జ్యేష్ఠ కుమారుడు చనిపోయిన వాని పేరు చొప్పున పిలువబడును (ద్వితి 25:5-6). హన్నా గొడ్రాలైనందున ఎల్కానా బహుశ రెండవ భార్యను స్వీకరించి యుండ వచ్చును. బైబిలులో అనేక గొప్పవ్యక్తులు బహుమంది భార్యలను కలిగియున్నట్లు మనకు కనబడినను, ఒకప్పుడు బహుభార్యాత్వమును దేవుడు సహించినను, మానవుని యెడల ఆయన ఆదిలో అట్టి ఉద్దేశ్యము కలిగి యుండలేదు (మత్తయి 19:3-9). ఎక్కువ మంది భార్యలున్న అన్ని సందర్భములలోవలె, ఎల్కానా యొక్క ఇద్దరు భార్యలు సమాధానముతో మెలగలేదు.

ప్రతి యేటా ఎల్కానా తన గ్రామమునుండి 25 మైళ్లు మట్టుకు పయనించి దేవుని ఆరాధించుటకు షిలోహుకు వచ్చేవాడు. సంవత్సరమునకు మూడు మారులు యూదులలో ప్రతి మగవాడు దేవుని ఆలయములో ప్రత్యక్ష పరచుకొనవలెను (ద్వితీ 16:16). పురుషులు మాత్రమే ఈ పండుగలలో పాలు పొందవలెను గనుక తన కుమారులతో షిలోహుకు వెళ్లుచు, తన భార్యలను ఇంటివద్దనే బహుశ విడిచి వెళ్లవచ్చును. కాని ఎల్కానా అయితే తన యింటి వారందరితో కూడ దేవుని ఆరాధించుటకు వెళ్లేవాడు.

దేవునికి కృతజతార్పణ చెల్లించుట ఈ పండుగలో ఒక భాగమై యుండెను. లేవీకాండము 7:11-15లో ఈ అర్పణ యొక్క వివరములు మనము తెలిసి కొనగలము. బల్యర్పణముగా వధింపబడిన పశువు యొక్క మాంసములో కొంత భాగము దేవునికి అర్పించబడేది. మిగిలినది అంతయు ఆదినముననే కుటుంబ సభ్యులు భుజింపవలెను. బల్యర్పణ చేసిననాడు ఎల్కానా తన భార్యయగు పెనిన్నాకును, తన కుమారులకు కుమార్తెలకు పాళ్లు ఇచ్చుచూవచ్చెను గాని హన్నాకైతే రెండు పాళ్లు ఇచ్చుచుండెను. ఏలయనగా అతడామెను ప్రేమించెను (1సమూ 1:4-5). అతడు ఇట్లు ఏటేటా చేయుచు వచ్చెను గాని హన్నాకైతే రెండు పాళ్లు

ఇచ్చుచుండెను. ఏలయనగా అతడామెను ప్రేమించెను (1సమూ 1:4-5). అతడు ఇట్లు ఏటేటా చేయుచు వచ్చెను. ఆ హేతువును బట్టి పెనిన్నా హన్నాను విసిగించుచు ఆమెకు కోపము పుట్టించుచుండెను. ఏలయనగా ఆమె గొడ్రాలు. దేవుని ఆరాధించు సమయమందు ఇవ్విధముగా ప్రవర్తించుట ఎంత ఘోరము! శాంతి సమాధానములు కలిగి యుండ వలసిన స్థానములో ఆందోళన ఆవేదనలు రేకెత్తించబడుచుండెను. బైబిలులో వ్రాయబడలేక పోయినను హన్నా ఆరాధించుటకు షిలోహుకు వెళ్ళు ప్రతిసారి సంతానము కొరకై ప్రార్ధన చేయుచుండెను. అయితే ఆమె ప్రార్ధనకు జవాబు లభించకపోయెను. పెనిన్నా యొక్క తీరును ఎల్కానా ఎరిగి యుండెను. గనుక అతడు హన్నాను ప్రియముగా చూచుకొనుచు ఆమెను ఆదరించుచు వచ్చెను.

1సమూయేలు 1:8లో చెప్పబడిన మాటలు ఆదరించుటకు, ఆమెను సున్నితంగా ఖండించుటకు చెప్పబడెను ఆమె తల్లికాక పోయినను, తన భర్త యొక్క ప్రేమను హెచ్చుగా పొందియున్నదని ఎల్కానా హన్నాకు చెప్ప ప్రయత్నించెను. ఎల్కానా యొక్క గద్దింపును అంగీకరించి ఆమె భోజనము చేసెను. వారు అన్నపానములు పుచ్చుకొనిన తరువాత హన్నా దేవునికి విన్నవించుకొనుటకు దేవుని మందిరముకు వచ్చెను.

దేవునికి విజ్ఞాపన చేయుటకుహన్నా ఆయనసన్నిధికి వచ్చెను. ఆమె బహు దు:ఖా క్రాంతురాలై యెహోవా సన్నిధిని ప్రార్ధన చేయుచు బహుగా ఏడ్చుచుండెను. ఆమె తన మనస్సులోనే ప్రార్ధన చేయుచు తన పెదవులు మాత్రము కదుపుచుండెను. ఆమె దేవునికి ప్రార్ధన చేయుచుండెను. దేవుడు మాత్రమే ఆమె ప్రార్ధనకు జవాబిచ్చువాడు. గనుక పైకి కనబడురీతిగా ఆమె ప్రార్ధించ లేదు. దేవుడు మాత్రమే ఆమె కోరుచున్నది వినగలవాడు. తన ప్రార్ధనలో హన్నా తనకొరకు ఒక కుమారుని అనుగ్రహించుమని దేవుని వేడుకొనెను. దేవుడు తనకొక కుమారుని అనుగ్రహించిన యెడల ఆమె అతనిని దేవునికే అప్పగింతునని ప్రార్ధించెను.

యాజకుడైన ఏలీ మందిర స్థంభము దగ్గిరయున్న ఆసనము మీద కూర్చుని ఆమె ప్రార్ధించుటను కని పెట్టుచుండెను. ఆమె పెదవులు మాత్రము కదుపుచు పైకి యేమీ శబ్ధము చేయకుండెనని అతడు గమనించెను. ఆమె మద్యము వలన మత్తురాలై అట్లు చేయుచున్నదని అతడు అపోహపడినా మత్తు పానీయములు సేవించుటను దేవుని గ్రంధము ఖండించుచున్నది (సామె 23:31). ఏలీ ఆమెను గద్దించ ప్రయత్నించెను గాని ఆమె మనో

దు:ఖముతో నిండి యున్నదిగాని మద్యముతో మత్తురాలై లేదని హన్నా వెంటనే అతనికి జవాబిచ్చెను.

అమె యొక్క దుఃఖారవిందమును గమనించి అమె సత్యమే చెప్పెనని ఏలీ గ్రహించెను. నీవు సమాధానముగల దానవై వెళ్లుమని ఏలీ ఆమెతో చెప్పెను. మరియు దేవుడు ఆమె కోరికను నెర వేర్చునని కూడ అతడు చెప్పెను. ఆమెదేవుని యేమి అడిగినదో ఏలీకి తెలుసని లేఖనములు సూచించుట లేదు. దుఃఖాక్రాంతురాలైన భక్తి గలస్త్రీ అమెయని అతడు గ్రహించి యుండెను. ఏలీ యొక్క మాటలను హన్నా అంగీకరించి తిరిగి వెళ్లెను.

తరువాత ఎల్కానాయు అతని కుటుంబమును ఉదయమందు వేగిరమే లేచి యెహోవాకు మ్రొక్కి రామాలోని తమ యింటికి వచ్చిరి. తదుపరి కొంత కాలానికి దేవుడు హన్నాను జ్ఞాపకము చేసికొనగా ఆమె గర్భవతియాయెను. ఆమె కుమారుని కని వానికి సమూయేలని పేరుపెట్టెను. ఎల్కానా షిలోహుకు ఏటేటా వెళ్ళే సమయము వచ్చుసరికి హన్నా అతనితో – బిడ్డపాలు విడుచువరకు నేను రాను అని చెప్పెను. ఆమె దేవునికి చేసికొనిన మ్రొక్కుబడిని మరచిపోలేదు. గాని బిడ్డ పాలు విడువగానే వానిని యెహోవా సన్నిధిని అగుపడి అక్కడనే ఉండునట్లు ఆమె సంకల్పించుకొని యుండెను. ఎల్కానా ఆమె యొక్క అభిప్రాయముతో ఏకీభవించెను.

1దినవృత్తాంతములు6:33 -38 బట్టి సమూయేలు లేవీ కుమారుడైన కహాతు సంతతికి చెందినవాడు. లేవీ కుమారులు యాజకులుగా యుండునట్లు దేవుడు ఏర్పరచుకొనెను (సంఖ్య 3:6–8). మరియు కహాతు కుమారులు పరిశుద్ధ స్థలములోని ఉపకరణములను మొ॥గు సామగ్రిని కాపాడు బాధ్యత గలవారు (సంఖ్య3:29– 31). లేవీ గోత్రమునకు చెందిన సమూయేలు 25వ సంవత్సరము నుండి 50 వసంవత్సరము వరకు దేవుని సొత్తు.

సమూయేలు మూడేండ్ల వయస్సు నాటికి తన తల్లి దండ్రులతో కలిసిఏటేటా వెళ్లులాగున షిలోహునకు పయనించెను. వారు షిలోహునకు రాగానే దేవునికి బల్యర్పణ అర్పింపబడెను. హన్నా సమూయేలును ఏలీ యొద్దకు తీసికొని వచ్చి, బిడ్డకొరకు ప్రార్ధన చేయగా దేవుడామెకు ఈ బిడ్డననుగ్రహించెనని జ్ఞాపకము చేసెను. కాబట్టి ఆమె దేవునికి మ్రొక్కుకొనినట్లు సమూయేలు జీవితకాలమంతయు యెహోవాకు ప్రతిష్ఠితుడని చెప్పెను. అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను.

సమూయేలు లేవీయుడు గనుక అతడు అప్పటికే దేవునికి

చెందినవాడు. తాను బ్రతికిన దినము లన్నియు అతడు యెహోవాకు ప్రతిష్ఠితుడని హన్నా మ్రొక్కుకొనెను. తదుపరి అతడు వయసు వచ్చుసరికి దేవునికి సేవచేయు సమర్థత గలవాడు.

1సమూయేలు 2వ అధ్యాయము లోని మొదటి పది వచనములు హన్నా చేసిన కృతజ్ఞత పూర్వకమైన ప్రార్థనరికార్డు చేయబడినది. కుమారుని గూర్చిన కోరికను దేవుడు నెరవేర్చినందున ఆమె ప్రార్థన కృతజ్ఞతతో నిండుకొనినది. రాబోవు మెస్సీయను గూర్చి ఆయన సంఘమును గూర్చి అందు ప్రవచనమున్నది. ఆ పండుగ అనంతరము ఎల్కానా కుటుంబము తమ యింటికి చేరుకొనిరి. సమూయేలు దేవుని మందిరములో విడిచి పెట్టబడెను.

ప్రతి సంవత్సరము హన్నా తన కుమారుని చూచుటకు వచ్చేది. ఆమె యొక్క ప్రేమానురాగములను ఏలీ గుర్తించాడు. ఆమె దేవునికి చేసిన వాగ్దానము నిలువుకొనినందున, ఏలీ ఆమెను ఆశీర్వదించి దేవుడామెకు మరికొంతమంది బిడ్డలనను గ్రహించాలని ప్రార్థించాడు. దేవుడతని ప్రార్థననాలకించి హన్నాకు ముగ్గురు కుమాళ్లను ఇద్దరు కుమార్తెలను దయచేసెను (1సమూ 2:21). బైబిలులో హన్నా తదుపరి మనకగుపడదు. గాని ఆమె యొక్క మాదిరి అన్ని కాలములలోను నిలిచియున్నది. భక్తివిశ్వాసములు గల స్త్రీ యొక్క సూక్ష్మప్రార్థన వలన సమూయేలు పుట్టెను. అతడు ఇశ్రాయేలీయుల అఖరి న్యాయాధిపతి మరియు పాతనిబంధన లోని గొప్ప దేవుని ప్రవక్త

**నేర్చుకొనదగిన సూత్రములు :**

**హన్నా దేవుని ఆరాధించేస్త్రీ :**

ఏటేటా జరుగు పండుగలలో పురుషులు మాత్రమే పాలు పొందవలెను. అయితే హన్నాప్రతి సంవత్సరము దేవుని నారాధించుటకు తన భర్తను వెంబడించేది, అది సులభ ప్రయాణం కాదు. వారు కాలినడకను గాని గాడిదమీద గాని రానుపోను 50 మైళ్లు ప్రయాణం చేసేవారు. యిది అనేక దినములు పట్టేది. బహుశ మార్గ మధ్యలో వారు గుడారములలో నివసిస్తూ, తమతో పట్టుకెళ్లిన వంటపాత్రలలో వంట చేసికొనేవారు. ఆ రోజులలో భోజనశాల లేమీ యుండేవి కావు. సరిగదా అది కష్టతరమైన ప్రయాణం. మరియు పెనిన్నా యొక్క ఆటుపోటు మాటలకు హన్నా సహించుకోవలసి వచ్చేది. ఆమె యింటివద్దనే వుండి ఏకాంతముగా దేవుని ఆరాధిస్తే చాల సులువుగా యుండును గదా. అయితే ఎంతకష్టమయినా దేవునిచే ఏర్పాటు చేయబడిన చోట ఏర్పాటు చేయబడిన స్థలములో ఆమె దేవుని

నారాధించేది.

నిర్ణీత స్థలంలో నిర్ణీత సమయానికి దేవుని న్నారాధించుటకు క్రైస్తవులు కొన్నిసార్లు చాల దూరము ప్రయాణించ వలసి వస్తోంది. అది ఎల్లవేళలా సులభము కాదు. సకాలమునకు అక్కడకు చేరుకోడానికి వారు ముందుగానే సిద్ధపడాలి. "అది చాల దూరము, నేను వెళ్ళనేనందున దేవుడు ఏమనుకోరులే" అని అనుకొనడం సులువే. గాని ప్రతి ఆదివారమున మనము ఆయన నారాధించుటకు కూడుకోవాలనేది దేవుని ఆజ్ఞ (అపొ.కా. 20:7; 1 కొరింథీ 16:1-2). హెబ్రీ పత్రిక లేఖకుడు క్రైస్తవులు సమాజముగా కూడుట మానరాదని హెచ్చరించాడు. (హెబ్రీ 10:25). ఈ వచనం క్రైస్తవులందరికీ అన్ని చోట్ల వర్తించును. గనుక ఆరాధనకు వెళ్ళుటకు ముందుగానే సంకల్పించు కొని సిద్ధపడవలెను.

పెనిన్నా యొక్క అసభ్య ప్రవర్తన వలన హన్నా దేవుని ఆరాధించుటకు మానుకోలేదు. ఒక్కోసారి తోటి క్రైస్తవుల స్వభావమును బట్టి కొందరు ఆరాధనకు వెనుకాడతారు. యితరుల ప్రవర్తన ఎట్లున్నా మనం ఆరాధనకు తప్పక కూడుకోవాలి. నీవు హన్నావలె యున్నా వా? దేవుని ఆరాధనకు ఎంత దూరమైనా ప్రయాణిస్తావా? యితరుల అసభ్యకర మాట లెట్లున్నా దేవుని నారాధించుటకు హన్నావలె ముందుంటావా ?

**హన్నా సహనము గల స్త్రీ :**

హన్నా యెడల పెనిన్నా అన్యాయ ముగా, హేళనగా, దురుసుగా ప్రవర్తిం చేది. గొడ్రాలైనందున పెనిన్నా ఆమెను ఓదార్చుటకు బదులు దెప్పిపొడుపు మాటలతో ఆమెను విసికించేది. అందు వలన బహుశా ఎల్కానా హన్నాను ఎక్కువ ప్రేమించేవాడు. మరియు ఆమెకు రెట్టింపు పాళ్ళను ఇచ్చేవాడు. పెనిన్నా అసభ్యముగా మాటలాడు చున్నను హన్నా ఆమెకు అదే రీతిగా జవాబిచ్చేది కాదు. పెనిన్నా చెప్పే సిగ్గుకరమైన మాటలకు అదే రీతిగా ఆమె కూడ జవాబియ్యగలదు గాని ఆమె తన ప్రార్థనతో జవాబిచ్చినది. "దుష్టుని ఎదిరింపక నిన్ను కుడిచెంప మీద కొట్టు వాని వైపునకు ఎడమ చెంపకూడ త్రిప్పుము" అని యేసు బోధించారు (మత్త 5:39). హన్నా అట్లే చేసింది. నీవు హన్నా వలె యున్నావా? నీయెడల దురుసుగా ప్రవర్తించువారి విషయంలో నీవు హన్నావలె ప్రవర్తిస్తావా ?

**హన్నా విమర్షను అంగీకరించినది :**

పిల్లలు లేనప్పుడామె దుఃఖాక్రాం తురాలై యుండగా ఎల్కానా ఆమెను సున్నితంగా మందలించాడు. పిల్లలు లేకపోయినను అతని ప్రేమను బట్టి ఆమె

సంతోషంగా యుండాలని చెప్పాడు. పదిమంది కుమారులకంటే నేను నీకు విశేషమైన వాడనుకానా?" అన్నాడు. ఈ సున్నితమందలింపును హన్నా అంగీకరించినది. ఆమె అన్నపానములు పుచ్చుకొని ప్రార్థించుటకు అతనితో కూడ దేవుని మందిరమునకు వెళ్లినది.

క్రైస్తవులవలె మనలను కొందరు మంచికో చెడుకో విమర్శిస్తారు. కొన్ని విమర్శలు మంచికే చేస్తారు. కొన్ని కీడు చేయుటకు చేస్తారు. అపార్థము వలన మరికొన్ని విమర్శలు వస్తాయి. అన్ని విమర్శలు పశ్చాత్తాపహృదయంతోనే మనం అంగీకరించాలి. నీవు హన్నావలె మందలింపును అంగీకరిస్తావా? అవుసరమైన మార్పులు చేస్తుకోగలవా?

**హన్నా ప్రార్థన పరురాలు :**

సుఖదుఃఖ సమయాలలో హన్నా దేవుని యొద్దకు వెళ్లేది. సంతానము కొరకు ఆమె దేవుని ప్రార్థన చేసినది. ఆమె ప్రార్థన ప్రత్యేకమైనది ఒక విధమెన బేరములాంటిది. దేవుడామెకు కుమారుని అను గ్రహిస్తే. అతనిని అయనకే సమర్పిస్తానన్నది. నాడున్న ఇశ్రాయేలీయులు నైతికవర్తనులుకారు. న్యాయాధిపతుల కాలములో వారు మంచి చెడుగుల మధ్య ఊగిసలాడేవారు. కొంత కాలము దేవుని సేవించే వారు మరికొంత కాలము ఆయనకు తిరగబడేవారు. యిది 350 సంవత్సరముల మట్టుకు కొనసాగెను. యాజకులైన ఏలీ కుమారులు దుర్మార్గులు తనకు కలిగిన కుమారుని దైవభయముతో పెంచి, ఇశ్రాయేలీయులకు నైతిక ప్రవర్తన నేర్పుటకు బహుశా హన్నా కుమారుని కొరకు దేవుని ప్రార్థించెను.

సమూయేలును ఏలీ దగ్గర విడిచి పెట్టినప్పుడు హన్నా దేవునికి ప్రార్థించినది. ఈ ప్రార్థన సంతోషభరితమైనది. ఆమె చేసికొనిన వాగ్దానమును సంతోషముతో నెరవేర్చినది. ఆమె నిస్వార్థక్రియ యొక్క ఫలితము నిత్యము ఉండును.

"ఎడతెగక నిత్యము ప్రార్థించుడి" యని 1థెస్స 5:17 చెప్పుచున్నది. అంగీకార యోగ్యమైన ప్రార్థన చేయు స్వభావమును మనం ఎల్లవేళల కలిగి యుండాలి. ఉదయం, మద్యాహ్నం, సాయంత్రం ప్రార్థించుటకు జ్ఞాపకముంచుకోవాలి (కీర్త 55:17). సమయమందును. అసమయ మందును ప్రార్థించాలి. మంచి రోజుల కొరకు చెడ్డరోజుల కొరకు కూడ దేవుని యొద్ద ప్రార్థించాలి. తదుపరి దేవుని జవాబును అంగీకరించుటకు సిద్ధపడాలి. అన్ని విషయములలోను మన చిత్తము కాదుగాని దేవుని చిత్తమే సిద్ధించునట్లు ప్రార్థించాలి. దేవుడు నీతిమంతుల విజ్ఞాపన నంగీకరించును (యాకోబు 5:16).

హన్నా ఒక ప్రత్యేకమైన ప్రార్థన చేసినది ఆమె దేవుని ఒక బిడ్డ కొరకని

కాదుగాని, ఒక కుమారుని కొరకు ప్రార్థించినది. దేవుడు తనకొక కుమారుని అనుగ్రహిస్తే అతనినేమి చేయునో కూడ ఆయనకు విన్నవించినది. మన ప్రార్థనలు కూడ అట్లే ప్రత్యేకముగా యుండాలి. మనం ఎందుకు అడుగుచున్నామో కూడ దేవునికి తెలియజేయాలి. దేవుడు మన విన్నపము నంగీకరిస్తే ప్రార్థనలో అయనకు విన్నవించుకొన్న రీతిగనే మన పాత్రను నిర్వహించాలి.

నీవు హన్నావలె ప్రార్థించుచున్నావా? నీకు అవుసరము వచ్చినపుడు మాత్రమే ప్రార్థించుదువా? మంచి జరిగినా, కీడు జరిగినా దేవునికి ప్రార్థించుదువా?

**హన్నా తన వాగ్ధానమును నెరవేర్చినది :**

హన్నా కుమారుని కొరకు ప్రార్థించి, ఆ కుమారుని దేవుని సేవకే అర్పిస్తానని వాగ్ధానం చేసినది. సమూయేలుకు కొంచెం వయస్సు రాగానే ఆమె ఆ వాగ్ధానమును నెరవేర్చినది. మందిరములో పనిచేయు నిమిత్తము అతనిని ఏలీదగ్గర విడిచిపెట్టినది.

క్రైస్తవులవలె మనం మన వాగ్ధానములను. నెరవేర్చుకోవాలి. వాగ్ధానము చేసిదానిని నెరవేర్చినవాడు బుద్ధిహీనుడని సొలొమోను చెప్పుచున్నాడు (ప్రసంగి 5:4). "నీవు మ్రొక్కుకొని చెల్లింపకుండుట కంటే మ్రొక్కు కొనకుండుటయేమేలు" (ప్రసంగి 5.5). మనం బాప్తిస్మము పొందినప్పుడు, దేవుని సేవ చేయుదుమని ఆయనకు చెప్పుచున్నాము. అట్లు చేయని యెడల మనం దేవునికి యితరులకు చేసిన వాగ్ధానమును నెరవేర్చని వారమవుదము. అట్లే యితరులకు చేసిన వాగ్ధానములను కూడ మనం నెర వేర్చాలి. ఒప్పుకొనిన దానిని సంపూర్తిగా నెరవేర్చాలి.

**దేవుని ఎట్లు ఆరాధించాలో హన్నా సమూయేలుకు నేర్పింది :**

"అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను" (1సమూ 1:28). దేవుని ఎట్లు ఆరాధించాలో హన్నా సమూయేలుకు నేర్పించి యుండెను. మూడు సంవత్సరముల వయస్సులోనే దేవుని ఆరాధించడం సమూయేలు ఎరుగును. "బాలుడగు సమూయేలు ఏలీ యెదుట యెహోవాకు పరిచర్య చేయుచుండెను" (1సమూ 2:11).

హన్నావలె మనం మన బిడ్డలకు చిన్న నాటినుండే దేవుని నారాధించుట నేర్పించాలి. అనేక సంఘాలలో చిన్న పిల్లలకు బైబిలు క్లాసులు జరుపుతారు. చిన్న బిడ్డలు పెద్దవారిని గమనిస్తు నేర్చుకుంటారు. గనుక పెద్దవారు దేవుని సన్నిధిలో భయభక్తులు గలవారై యుండాలి. ఆరాధన సమయంలో అటు యిటు తిరుగకూడదు, ప్రక్కవారితో

సంభాషించ కూడదు. సెల్‌ఫోన్ల్ మాట్లాడ కూడదు. చిన్నబిడ్డలు దీనినంతా గమనిస్తారు. నేర్చుకొంటారు.

నీవు హన్నా వలె యున్నావా? దేవుని నారాధించే ప్రాముఖ్యతను నీవు నీ బిడ్డలకు నేర్పింతువా? ఆరాధనలో నీ ప్రవర్తన బిడ్డలు అనుకరింపదగినదిగా యున్నదా? తల్లి వలె నీ బిడ్డలకు హన్నావలె భయభక్తులు నేర్పుము.

## మన ఆత్మీయ స్థితి ఏలాగున్నది?
## (How is our Spiritual Status ?)

**ఆదామా, నీవెక్కడ ఉన్నావు ?**

ఆదాము, హవ్వలు దేవుని ఆజ్ఞను అతిక్రమించి దేవుడు తినవద్దని ఆజ్ఞాపించిన మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్షఫలములను తిని దేవుని ఎదుట పాపము చేసారు. దేవుడు -ఆదామా, నీవెక్కడ ఉన్నాడు? అని ప్రశ్నించగా ఆది 3:10 "తాను దిగంబరిగా ఉన్నందున భయపడి చెట్ల చాటున దాగి యున్నాను అని ఆదాము జవాబిచ్చాడు.

సర్పము ఆది. 3:4-5 "మీరు చావనేచావరు మీ కన్నులు తెరవబడినవారై మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతల వలె ఉందురు" అపవాది సగము సత్యము చెప్పి మానవులను పాపములో పడవేయును యోహాను 8:44 ఆది నుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలచినవాడు కాడు ......... అబద్ధమునకు జనకుడైనై యున్నాడు.

హవ్వ ఆది 3:6లో సాతాను యొక్క మాటలు నమ్మి ఆహారమునకు మంచిది (శరీరాశ) కన్నులకు అందమైనది (నేత్రశా) వివేకమిచ్చు రమ్యమైనది (జీవపుడంభము) ఆపండు తినాలనే దురాశ కల్గినది. యాకోబు 1:15. "దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును".

దురాశవలన అక్రమాలు, హత్యలు, యుద్దాలకు కారణమగును తన పొరుగువారి కంటే తాను ఉన్నతంగా ఉండాలి, ధనవంతునిగా ఉండాలి బాగా సంపాదించాలి పలుకుబడి గలవానిగా ఉండాలి అని అక్రమ మార్గాలు ఎన్నుకుంటారు.

ఆదాము చేసిన పాపము దేవుని సన్నిధి నుండి అతని దూర పరచినది. మన పాపములు మనకును దేవునికిని అడ్డుగా యున్నవి. పాపము చేసిన ఆదాము దేవుని స్వరము విని పరిశుద్ధుడైన దేవుని ఎదుటకు రాలేక చెట్లచాటున దాగుకొన్నాడు. యోహాను 3:19 "వెలుగు లోకము లోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమించక చీకటినే ప్రేమించిరి.

ఆదాము హవ్వలు తమ దిగంబరత్వమును కాపాడు కొనుటకు అంజూరపు ఆకులతో కచ్చడములు చేసి కొన్నారు. అవి కొద్దిసేపటికే ఎండిపోయి రాలిపోవుటచే తిరిగి దిగంబరులు అవుతామని వారు గ్రహించలేదు, చాల మంది పాలమనే దిగంబరత్వాన్ని స్వనీతి అనే వస్త్రాలతో కప్పుకోవాలని చూస్తారు. పుణ్యకార్యాలు, దానధర్మలు అనేవి స్వనీతి వస్త్రాలు యెషయా 64:6. "మన నీతిక్రియలు దేవుని ముందు మురికి గుడ్డలవలె ఉన్నాయి "

హెబ్రీ 9:22 "రక్తము చిందించకుండా పాపక్షమాపణ కలుగదు" ఆది 3:21 "పశువుల చర్మముతో చొక్కాయిలను చేయించి ఆదాము హవ్వలకు తొడిగించెను" అనగా పశువును బలిగా ఇచ్చాడు. పాపము వలన నశించిపోతున్న మానవాళిని రక్షించుటకు దేవుడు తన ప్రియకుమారుని ఈలోకములోని లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లగా పంపెను. యేసుప్రభువు తన పరిశుద్ధ రక్తమును సిలువలో చిందించి పాప పరిహారాన్ని కల్గించి రక్షణ అనే ప్రశస్త వస్త్రాన్ని ఇచ్చారు. ప్రకటన 3:17,18 "దౌర్భాగ్యుడవు .... తెల్లని వస్త్రము" ప్రశస్తమైన తెల్లని వస్త్రము అనే రక్షణ వస్త్రము పాపమనే దిగంబరత్వాన్ని కనబడకుండా చేయును.

ఆదాము తాను చేసిన పాపమును దేవుని ఎదుట ఒప్పుకొనక ఆ తప్పును హవ్వపైకి - హవ్వ సర్పముపైకి నెట్టెను.

ఈనాడనేకులు పాపము విషయమై పశ్చత్తాపపడక దేవుని క్షమాపణ కోరుటకు బదులుగా, పాపము చేయడాన్కి కారణం ఈ సమాజము అని లేక తల్లి దండ్రులు, జీవితభాగస్వామి, పేదరికము కారణముగా చూపిస్తూ యుంటారు.

సామె 28:13" అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టు వాడు కనికరము పొందును". కీర్తన 32:1" తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు తన పాపములకు ప్రాయశ్చిత్తము పొందిన వాడు ధన్యుడు"

ఇతరులపైకి నెట్టి వేయక పాపముల విషయమై పశ్చాత్తాపపడి వాటిని విడిచిపెట్టాలి. అట్టి కార్యములు చేయకుండా ఉండాలి. ఆదాము ఉన్న ఆత్మీయస్థితిలో ఈనాడనేకులు ఉన్నారు.

**యేసు ఎవరో అని చూడగోరెను :**

జక్కయ్య సుంకపు గుత్తదారుడు (లూకా 19:1-10). జక్కయ్య యేసు ఎవరో అని చూడగోరి పొట్టి వాడైనందున మేడిచెట్టు ఎక్కెను యేసును చూచుటకు పొట్టితనము అడ్డువచ్చినది. జక్కయ్య రోమా ప్రభుత్వము పక్షమున సుంకము వసూలు చేసే వాడు. ప్రభుత్వ అధికారి అయినను తాను మేడి చెట్టు ఎక్కితే ఇతరులు అవహేలన చేస్తారని

సిగ్గుపడలేదు యూదులు ప్రభువును మెస్సయ్యగా గుర్తించక తృణీకరించారు. జక్కయ్య సుంకరి, అన్యుడు యూదుల దృష్టిలో పాపియైన జక్కయ్య ప్రభువును వెదికాడు ఆయన ఎవరో అని చూడ గోరెను. ప్రభువు అందరి హృదయాలోచనలు ఎరిగినవాడు గనుక "జక్కయ్యా త్వరగా దిగుము నేడు నేను నీఇంట ఉండవలసి యున్నది" అని చెప్పెను. యిర్మీయా 29:13 "మీరు వెదకిన ఎడల పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు నన్ను నేను మీకు కను పరచుకొందును".

జక్కయ్య తన పాపములను ఒప్పుకొనిన వెంటనే ప్రభువు నేడు ఈ ఇంటికి రక్షణ వచ్చియున్నది. అని చెప్పెను.

ప్రభువా నేవెవడవు ?

అపొ.కా. 22:1-8 తార్సువాడైన సౌలు యూదుడు, రోమీయుడు, గమలియేలు వద్ద ధర్మశాస్త్ర సంబంధ విషయములపై శిక్షణ పొందాడు. దేవుని గూర్చి మిక్కిలి ఆసక్తి కల్గి యున్నానని తలంచాడు. కాని యేసుక్రీస్తును మెస్సయ్యగా అంగీకరించ లేదు. యేసుక్రీస్తును సేవించేవారిని హింసించుటకు ప్రధాన యాజకుల వద్ద అనుమతి పొంది దమస్కునకు బయలు దేరాడు (ఫిలప్పీ 3:5,6). అపో 9:5 "సౌలా, సౌలా నీవెందుకు నన్ను హింసించుచున్నావు? అని ప్రభువు స్వరము వినినప్పుడు "ప్రభువా నీవెవడవు? అని ప్రశ్నించెను.

ఈనాడునెకులు క్రైస్తవులమని చెప్పుకుంటూ వాక్యమును వింటున్నా వాక్యానుసారముగా జీవించక ప్రభువుని ఎరుగని వారుగానే ఉంటున్నారు. లూకా 9:18-19. "కొందరు బాప్తీస్మమిచ్చు యోహానని యు, కొందరు ఏలీయా అనియు, కొందరు పూర్వకాలపు ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొను చున్నారు" లూకా 7:23. "నావిషయమై లోకరక్షకునిగా గుర్తించలేక సౌలువలె ప్రభువా నీవెవడవు ? అని అడిగేస్థితిలో ఉన్నారు.

**ఆయన ఎవరో నేనెరుగను :**

పేతురు 31/3 సంవత్సరములు ప్రభువుతో ఉండి ఆయన బోధలు విన్నాడు అద్భుత కార్యములు చూసాడు రూపాంతర కొండపై ఆయన మహిమను చూచాడు "నీవు సజీవుడవైన దేవుని కుమారుడవైన క్రీస్తువు " అని అన్నాడు. లూకా 22:57-58 యోహాను 12:42 లో పేతురు ఆయన ఎవరోనే నెరుగను "అని చెప్పెను. ప్రభువును బహిరంగముగా ఒప్పుకొనక రహస్యవిశ్వాసులుగా ఉంటున్నారు. తరువాత పేతురు పశ్చాత్తాపపడ్డాడు

పునరుద్ధానుడైన ప్రభువు శిష్యులకు కనబడి విశ్వాసములో బలపరిచాడు పరిశుద్ధాత్మను పొందకున్నపేతురు ప్రభువును గూర్చిన రక్షణ సువార్తను ప్రకటించాడు 3వేల మంది బాప్తిస్మము పొందారు.

పౌలు మారు మనస్సు పొంది అనేకులను క్రీస్తులోనికి నడిపించాడు పత్రికల ద్వారా క్రీస్తు రక్షణ సువార్తను చాటారు. 2 తిమోతి 4:7 "మంచి పోరాటమును పోరాడితిని .......... నాకొరకు నీతి కిరీటము ఉంచబడియున్నది. అని పౌలు చెప్పాడు.

ఆత్మీయ జీవితంలో క్రింది స్థాయినుండి పైస్థాయి కి ఎదిగారు. ఆదామా (ఓక్రైస్తవుడా) నీవెక్కడ ఉన్నావని దేవుడు మనలను ప్రశ్నిస్తే మన ఆత్మీయస్థితి ఏ విధముగా ఉన్నది?

1) ఆదామువలె దేవుని పరిశుద్ధ సన్నిధి నుండి పారిపోయి ఇంకా పాపము లోనే జీవిస్తూ మన ఆత్మీయస్థితికి వేరొకరిని దోషలుగా చూపిస్తూ న్నామా?

2) జక్కయ్య వలె "ఆయన ఎవరో అని చూడగోరి" పరిపూర్ణ మనస్సుతో ప్రభువును అన్వేషించి ఆయన ఇచ్చు రక్షణను పొందు కుంటున్నామా?

3) సౌలు వలె దేవుని గూర్చిన ఆసక్తి కలిగినవారమని అనుకుంటూ మన క్రియలు ద్వారా ఆయనను హింసిస్తూ ఆయనను గుర్తించలేక "ప్రభువా నేవెవడవని" ప్రశ్నిస్తూ నామకార్ధ క్రైస్తవులుగ యున్నామా?

4) పేతురువలె విశ్వాసముగా జీవిస్తూ శోధనవచ్చినపుడు లోకానికి భయపడి "ఆయనెవరో నేనెరుగను" అనేరహస్య విశ్వాసులుగా యుంటున్నామా?.

మొదటి ఆదాము వలె ఉన్న పాపపుస్థితి నుండి క్రీస్తురక్తము వలన విమోచింపబడి కడపటి ఆదాముగా పిలువబడే క్రీస్తుయేసు యొక్క సారూప్యములోనికి మార్చబడుటకు క్రీస్తు యేసును ధరించుకొందము.

– బి.యస్. సువార్త

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**– ఎడిటర్**

# సంక్షిప్త వార్తలు

2012 అక్టోబరు 10వ తేదీనాడు అల్లవరం మండలం దేవగుప్తంలో సోదరులు N.ఏలియా గారు ఏర్పాటు చేసిన కృతజ్ఞత కూటములో రిక్కీగూటం గారు కుటుంబ సమేతముగా పాల్గొని చక్కటి వాక్యపరిచర్య చేసిరి.సోదరులు యన్.ఏలియా గారు దేవగుప్తంలోను,అల్లవరం మండలంలోను పలు స్థానిక క్రీస్తుసంఘములను స్థాపించి,తన కుమారుడు జగజీవన్‌రాజుతో కలసి క్రీస్తు కొరకు గొప్పపని చేయుచున్నారు.

2012 అక్టోబరు 20వ తేదీ శనివారం కాకినాడ–**సత్యవాణి** ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను.ఉభయగోదావరి జిల్లాల సువార్తికులు అనేకులు హాజరైరి.ఆదినమందు"**నేడు అద్భుత స్వస్థతలు జరుగుచున్నావా?**" అను అంశము చర్చించబడెను.సోదరులు జి.షద్రక్(పాలకొల్లు),డి.ఇశ్రాయేలు రాజు(కొండుకుదురు),యమ్.ప్రేమ్‌కుమార్(చదలాడ),వి.బాబీ(అమలాపురం), యన్.ఏలియా(దేవగుప్తం) గార్లు చక్కగా పై అంశమును వివరించిరి.

దేవుడు గతంలో చేసినది యావత్తు అద్భుతరీతిగా చేసెను.తదుపరి దానిని ఒకసూత్రమునకు బంధించెను.తదుపరి అద్భుతము అవుసరము లేకుండ గానే అది తనపని చేసికొనుపోవునట్లు ఆయన చేసెను.ఈ ప్రకృతి అంతా అద్భుతరీతిగానే సృజించబడినను,నాటినుండి నేటివరకు అది దేవుడిచ్చిన ప్రకృతి చట్టము చొప్పున చలించుచున్నది.ప్రతి జీవరాశి ఆదిలో అద్భుతరీతిగా సృజింపబడినను,ప్రతి జాతియు దానిదాని ప్రకారము ఉద్భవించునట్లు దేవుడు ప్రతి దాని బీజమును దానిలోనే నియమించెను.

అట్లే క్రీస్తు యొక్క సంఘము పెంతెకొస్తు నాడు అద్భుత రీతిగా ఆవిష్కరింపబడెను.సంఘము బలపడి,వాక్యము స్థిరపరచబడునట్లు దేవుడు ఆదిమ అపొస్తలులకు,సభ్యులకు పరిశుద్ధాత్మ అద్భుతశక్తి ననుగ్రహించెను. తద్వారా వారు రోగులను బాగుచేసిరి. రోగులు తక్షణవే,సంపూర్తిగా నాడు స్వస్థతనొందిరి.క్రొత్తనిబంధన సంపూర్తిగా లిఖింపబడగానే అద్భుతవరములన్ని నిలచిపోయెను.అయినను నేటికిని దేవుడు రోగులను బాగుచేయుచున్నారు. అది అద్భుత రీతిగా గాక,సహజసిద్ధముగాను,వైద్యుల ద్వారాను దేవుడు నేడు రోగులను స్వస్థపరచుచున్నారు.గొప్ప స్వస్థత వరములు గలవారమని చెప్పకొనేవారు,అట్లు చెప్పించుకొనువారు,అద్భుత రీతిగా బాగుపడ్డామనుకొనేవారు భ్రమపరచు ఆత్మయందు నమ్మికయుంచువారని సహోదరులు లేఖనములపై ఆధారపడి బోధించిరి.

# మీకొకగొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప నదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.


## Satya Vani

#7-9-35, Sambamurth Street,

Kakinada - 533 004. Ph: 0884 - 2363722



RNI Regd. No. 69973/98

Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:

**SATYA VAKKU**

P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004